చేనేతపై చిన్నచూపు

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూతపడుతున్న మగ్గాలు
- గతంలోనేత కార్మికులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా రూ.24 వేలు వర్తింపు
- గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రూ.కోట్ల సాయం


ఉరవకొండలోని చెంగలవీధిలో మూతపడిన మగ్గాలు


ఉరవకొండలో మగ్గం నేస్తున్న కార్మికుడు (ఫైల్)

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేనేతకు జవసత్వాలు కల్పించి, నేతన్న నేస్తంతోపాటు సంక్షేమ పథకాలు పారదర్శకంగా వర్తింపజేశారు. జగనన్న ప్రభుత్వంలో చేనేత కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత నేతన్నకు మొండిచేయి చూపింది. చేనేతకు ప్రసిద్ధిగాంచిన ఉరవకొండలో ప్రతి ఎన్నికల్లోనూ గెలుపోటములు శాసిస్తున్నారు. చేనేతల ఓట్లతో గెలుపొందిన అధికార పార్టీ వారి బాగోగులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సంక్షేమ జాడలేకపోవడంతో కార్మికులు మగ్గం వృత్తికి స్వస్తి పలుకుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధర్మవరం తర్వాత చేనేత రంగానికి ఉరవకొండ ప్రసిద్ధి చెందింది.

ఉరవకొండలో దాదాపు 3 వేల కుటుంబాలు ఉన్నాయి. ప్రతి ఎన్నికల్లో ఎన్నికల్లో గెలుపోటములను శాసించే విధంగా దాదాపు 15 వేల మంది చేనేత కులానికి చెందిన ఓటర్లు ఉన్నారు. ఆరు నెలలుగా చేనేత పరిశ్రమ జవసత్వాలు కోల్పోతోంది. పాలకులు చేనేతపై చిన్నచూపు చూడటంతో చాలా మంది జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్లిపోగా, నమ్ముకున్న కులవృత్తిని వదిలి పెట్టలేక కొందరు ఇదే రంగంలో కొనసాగుతున్నారు.

నేతన్నకు అండగా జగనన్న ప్రభుత్వం..

చేనేత రంగానికి గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. సొంత మగ్గం ఉన్న నేత కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.24,000 ఆర్థిక సహాయం అందించారు. ఐదేళ్లలో ఉరవకొండ నియోజకవర్గంలో సరాసరి 2,800 కుటుంబాలకు రూ.1.25 కోట్ల లబ్ధి చేకూరింది. నేతన్న నేస్తంతో పాటు ఆయా కుటుంబాల్లోని అర్హత ఉన్న తల్లులకు అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, పింఛన్, వాహన మిత్ర, ఆరోగ్యశ్రీ తదితర పథకాల కింద ఒక్కో కుటుంబానికి రూ.లక్షకు పైగా సహాయం అందించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేనేత సంఘాల రుణాలు మాఫీ చేయడంతో పాటు పావలా వడ్డీకే రుణ సదుపాయం, కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్, ఇలా ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తే తండ్రి బాటలోనే సీఎం జగన్ నేతన్నలను ఆదుకుంటూ వచ్చారు.

ఉరవకొండలో మూతపడిన మగ్గాలు..

చేనేత కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్టీఆర్ హయాంలో మాదిరి చీర – ధోవతి పథకాన్ని పునరుద్ధరిస్తామని, చేనేత ఉత్పత్తులపై 30 శాతం రిబేటు ఇస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలో కొచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని నేతన్నలకు చిన్నచూపు చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అదే ధోరణిలో ఉన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉరవకొండలో చేనేత పరిశ్రమకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువు అయ్యిందని పెద్ద ఎత్తున మగ్గాలు మూలనపడుతున్నాయి. కార్మికులకు ఉపాధి లేకపోవడంతో ఆరు నెలల్లోనే 200 మగ్గాలు మూతపడ్డాయి.

గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం సాయం ఇలా:

సంవత్సరం	లబ్ధిదారులు	సహాయం (రూ.లక్షల్లో)
2019-20	1,224	29.37
2020-21	963	23.12
2021-22	949	22.17
2022-23	1,015	24.35
2022-24	1,123	26.95
	5,274	రూ.1.25 కోట్లు

మగ్గం మూతపడింది



గత ఆరునెలలుగా నేతన్న పరిస్థితి దుర్భరంగా మారింది. గతంలో నేతన్న నేస్తంతో పాటు అనేక సంక్షేమ పథకాలు కార్మికులకు అందేవి. ఇప్పుడు నేసిన చీరకు గిట్టుబాటు ధర లేక మగ్గాలు మూతపడుతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.
– నీలూరి అమర్నాథ్, కార్మికుడు ఉరవకొండ

చేనేతలపై సర్కారు నిర్లక్ష్యం



కూటమి ప్రభుత్వం చేనేతలకు మొండి చేయి చూపడంతో ఉరవకొండలో వందలాది మగ్గాలు మూతపడుతున్నాయి. ఇప్పటి వరకు నేతన్న కోసం ఒక్క పథకం కూడా అమలు చేయకుండా కార్మికులు రోడ్డున పడేలా చేశారు.
– చందా చంద్రమ్మ, ఉరవకొండ

ప్రభుత్వం బాధ్యత వహించాలి



కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోంది. నేత కార్మికులకు ఉపాధి లేదు. ఆకలితో అలమటించే రోజులు వచ్చాయి. ఉరవకొండలో చేనేత పరిశ్రమ మూతపడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణం.
– తలారి సులోచన, చేనేత సంఘం నాయకురాలు, మాజీ ఎంపీటీసీ, ఉరవకొండ

నేడు మొలకాల్మూరులో ఇస్తెమా


మొలకాల్మూరులోని ఇస్తెమా స్థలంలో ఏర్పాట్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరు పట్టణంలో 17,18 తేదీల్లో నిర్వహించిన ఇస్తెమా (ఇస్లామిక్ ధార్మిక సమ్మేళనం)కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొలకాల్మూరులోని హానగల్‌కు వెళ్లేదారిలో మదరసా పక్కన క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఇస్తెమాకు రాయదుర్గం డివిజన్ పరిధిలో కణేకల్లు, కంబదూరు, కళ్యాణదుర్గం, వైఎస్‌ఎస్ కోట, మొలకాల్మూరు ప్రాంతాల నుంచి వేలాది మంది ముస్లింలు సదస్సుకు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. గురువారం సాయంత్రం నాటికే ఇస్తెమాకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాయదుర్గం డివిజన్ జమాత్ పెద్దలు, సభ్యులు ఏర్పాట్లను పరిశీలించి, సౌకర్యాలపై చర్చించారు. ప్రధాన పెండాల్, పార్కింగ్, భోజన వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాట్లను పర్యవేక్షించారు. బెంగళూరు నుంచి మౌలానాలు హాజీ ఫారూక్‌సాబ్, మౌలానా తాహీర్ ఖురేషి, ముఫ్తీ అస్లాంసాబ్, మౌలానా అక్బర్ షరీఫ్‌సాబ్, సిరాజ్‌భాయ్, నూర్‌భాయ్ హాజరవుతున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం జుమా నమాజ్ నుంచి పూర్తిస్థాయిలో ఇస్తెమా ప్రారంభమై శనివారం రాత్రి ఇషా నమాజ్ తరువాత ముగుస్తుందని జమాత్ నిర్వాహకులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


జిల్లా అధ్యక్షుడు అనంతను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల నాయకులు

కణేకల్లు: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న జిల్లా అధ్యక్షుడు అనంతను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కమిటీలో స్థానం కల్పించడంపై మారెన్న కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా కణేకల్లు మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన జిల్లా అధ్యక్షుడు అనంతను కలిశారు. అదేవిధంగా జెడ్పీచైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ తలారి రంగయ్యను కలిశారు. కార్యక్రమంలో నాయకులు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, మారెంపల్లి నాగరాజు, శ్రీనివాసులు, తిమ్మప్ప, వేమన, మహేష్, భీమేష్ పాల్గొన్నారు.

'ట్రబుల్' రైడింగ్


చంటి పిల్లలతో ఒకే బైక్‌పై ఇలా...


ప్రధాన రహదారిలో ఆటోపై ఇనుప చువ్వలతో..


ఆటోకు వేలాడుతూ ప్రమాదకర ప్రయాణం...

రాయదుర్గంటౌన్: వాహనాలు నిత్యవసరాలు అయ్యాయి. అత్యవసరమో.. అందరూ కలిసి వెళ్లాలనో .. ఏదైతేనేం ద్విచక్రవాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం శ్రుతిమించుతోంది. గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ఆత్రత కాస్త.. ప్రమాదకరంగా మారుతోంది. దీనికి తోడు ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తుండడం కూడా ప్రమాదకరంగా మారుతోంది. ఇటీవల కాలంలో ఏకంగా బైక్‌పై నలుగురు కూడా వెళ్తున్నారు. మరోవైపు లగేజీ టాటా ఏస్ వాహనాల టాప్‌పైన, ఆటోల్లో ఇరువైపులా కరుసుకొని ప్రయాణిస్తున్నారు.దీంతో ఏదో ఒక చోట ప్రమాదాలు తరచూజరుగుతూనే ఉన్నాయి. మరికొన్ని చోట్ల మృత్యువాత కూడా పడుతున్న ఘటనలూ ఉన్నాయి. రాయదుర్గం పట్టణంలోని అనంతపురం రహదారి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు వరకు ప్రజా రవాణాలో వారంరోజులుగా కనిపించిన ప్రమాదకర దృశ్యాలివి.


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్


బైక్‌పై దూసుకెళుతున్న యువకులు

వరి కొయ్యకు నిప్పు.. భూసారానికి ముప్పు

- అవగాహన లోపంతో గడ్డి కొయ్యలను కాల్చేస్తున్న రైతులు
- కలియదున్నితేనే ప్రయోజనమంటున్న వ్యవసాయాధికారులు

బొమ్మనహాళ్: ఖరీఫ్ అనంతరం రబీలో పంటలకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలు నాగలికి అడ్డంకిగా మారి దుక్కిలో ఎక్కువ సమయం తీసకుంటుందనే ఉద్దేశంతో వరి కొయ్యలతో పాటు గడ్డికి నిప్పు పెట్టి బూడిద చేస్తున్నారు. అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాధికారులు చెబుతున్నారు. పంట నూర్పిడి తర్వాత పొలాన్ని కలియదున్నితేనే ప్రయోజనమని సూచిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో హెచ్చెల్సీ ఆయకట్టుతో పాటు వ్యవసాయ బోరుబావుల కింద 14,622 హెక్టార్లలో వరి పంటలు కోతకొచ్చాయి. రైతులంతా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యంత్రాల వినియోగం అధికమైంది..

వ్యవసాయంలో కూలీల కొరత అధిగమించేందుకు యంత్రాల వినియోగం అధికమైంది. నేలను దుక్కి చేయడం మొదలు.. పంట కోత పనుల వరకూ రైతులు యంత్ర సాయంతోనే పూర్తి చేస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో గడ్డి వినియోగం క్రమంగా తగ్గింది. పాడి, పశువులున్న వారు మాత్రమే కోత గడ్డిని సేకరించి, నిల్వ ఉంచుకుంటున్నారు. మిగిలిన వారు పొలాల్లోనే వదిలి పెట్టేస్తున్నారు.

నిప్పు పెట్టడం వల్ల నష్టాలు ఇవీ..



- వరి కొయ్యలు కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమి సారవంతం కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గిపోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.
- గట్టుపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కసారి బుగ్గి పాలవుతాయి. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాలు దగ్గర ఉంటే ధాన్యం కాలిపోయే అవకాశం ఉంది.

కలియదున్నితేనే ప్రయోజనం



- వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు, రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకూ తగ్గితుంది.
- కలియ దున్నితేనే ఎకరాకు సుమారు టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని, 5 శాతం పాస్ఫరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు అంది పంటలకు మేలు చేకూరుతాయి.
- నేలలో కరగని మూలకాలు అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.
- టన్ను గడ్డి కావాలంటే వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరం కానున్నాయి. కొయ్య కాళ్లను భూమిలో కలియ దున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి.
- పొలంలో దున్నే పది రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్ఫేట్ చల్లాలి. భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచొచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి



వరి కోతలు పూర్తి చేసిన రైతులు కొయ్యలకు నిప్పు పెట్టడం సరికాదు. జాగ్రత్తలు పాటిస్తేనే నేలలో సారవంతాన్ని కాపాడుకోవచ్చు. దీనిపై క్షేత్రస్థాయిలో ఆర్‌బీకే సిబ్బంది ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తాం. వారి సూచనలను ప్రతి రైతూ తప్పక పాటించేలా చర్యలు చేపడతాం.
– సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ సెక్రటరీకి సన్మానం


వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ సెక్రెటరీగా నియమితులైన ఎర్రంపల్లి కృష్ణమూర్తిని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం సన్మానించారు. కళ్యాణదుర్గంలోని జిల్లా యాక్టివిటీ సెక్రటరీ ఎర్రంపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు. కార్యక్రమంలో ముప్పకుంట జానీ, మల్లికార్జున, బసవరాజ్, బాలకృష్ణ, తిప్పేస్వామి, చంద్ర పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ జాతర

శెట్టూరు: చింతర్లపల్లిలో నిర్వహిస్తున్న కొల్లాపురమ్మ జాతర నాల్గో రోజు ప్రశాంతంగా జరిగింది. గురువారం సాయంత్రం గావు కార్యక్రమం చేశారు. రాత్రికి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకాన్ని ప్రదర్శించారు. శుక్రవారం శాంతి పూజతో జాతర ముగుస్తుంది.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు


అలంకరణలో సర్మాస్ హుసేనీ సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థ ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. అనంతరం కందూరీలు చేశారు.

భంభంస్వామి దర్గాలో పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమ దర్గాలో భంషేక్ అబ్దుల్ స్వాముల జీవ సమాధిని గురువారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. గురువారం విశేష పూజలతో పాటు ప్రత్యేక ఫాతెహా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

కేంద్రం మొండి వైఖరి వీడాలి

రాయదుర్గంటౌన్: రైతులకు కనీస మద్దతు ధర కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి, రైతు ఉద్యమ నాయకుడు జగ్జీత్‌సింగ్ ప్రాణాలను కాపాడాలని సీపీఐ డిమాండ్ చేసింది. గురువారం సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని పంజాబ్, హర్యానా రైతులు ఏళ్ల తరబడి నిరసనలు తెలుపుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్రం స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం కార్యదర్శి తిప్పేస్వామి, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండలో ఫాగింగ్

ఉరవకొండ: మేజర్ పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో దోమల నివారణకు ఫ్యాగింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. గురువారం ఈఓ గౌస్‌సాహెబ్‌కు 50 లీటర్ల దోమల నివారణకు వినియోగించే మందుతో పాటు కరపత్రాలను అందించారు. ఈఓ గౌస్‌సాహెబ్ పర్యవేక్షణలో ప్రతి వార్డుల్లోనూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రమాదాల నివారణే మాసోత్సవాల లక్ష్యం


ఆర్టీసీ మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సీఐ మహానంది

ఉరవకొండ: రోడ్డు నియమాలు పాటిస్తే వంద శాతం ప్రమాదాలు అరికట్టవచ్చని, ప్రమాదాల నివారణే మాసోత్సవాల లక్ష్యమని ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది తెలిపారు. గురువారం ఉరవకొండ ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో సీటీఎం శ్రీలక్ష్మి, ఎస్టీఐ రమణమ్మలు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ఇంధన పొదుపుతో పాటు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు అత్యంత చాకచక్యంతో భారీ ప్రమాదాలు చోటు చేసుకోకుండా వ్యవహరించారని, ఇందుకు ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సంస్థ మాక్‌డ్రిల్‌లు ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్యం తీసుకోరావాలన్నారు. అనంతరం రోడ్డు నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కణేకల్లు: కణేకల్లుక్రాస్ – బళ్లారి మార్గమధ్యంలో అంబాపురం క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురవళ్లికి చెందిన సోంశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. సోంశేఖర్‌రెడ్డి తన స్నేహితుడు నాగిరెడ్డితో కలిసి గెనిగెర నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఇదే సమయంలో పర్వతరెడ్డి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ క్రమంలో కర్ణాటక జిందాల్ ఫ్యాక్టరీ నుంచి హిందూపురానికి వెళ్తున్న లారీ కింద సోంశేఖర్‌రెడ్డి పడడంతో లారీ అతని కుడికాలుపై వెళ్లింది. కాలు నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు అతన్ని బళ్లారి విమ్స్‌కు తరలించారు. నాగిరెడ్డి, పర్వతరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

రాయదుర్గంటౌన్: వాహనదారులు భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టొచ్చని రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీలో డిపోలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ఎంవీఐతోపాటు ఆర్టీసీ డీఎం శ్రీనివాసులు మాట్లాడారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండిషన్లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఏటా సమోదయ్యే మరణాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలే అన్నారు. డ్రైవర్లు తన వ్యక్తిగత జీవితంతో పాటు ప్రయాణికుల జీవితాలను కూడా గుర్తించాలన్నారు. కచ్చితంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వాహనదారులు కచ్చితంగా నియమాలు పాటించాలన్నారు.

హెల్మెట్ వాడకపోతే చర్యలు

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను వాడకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. గురువారం బొమ్మనహాళ్‌లో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపేవారికి జరిమానా వేశారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాణ రక్షణ కోసం హెల్మెట్‌ను వాడాలని, వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ అవగాహన కల్పించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

బ్రహ్మసముద్రం: వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి– గొంచిరెడ్డిపల్లి గ్రామాల మధ్య వాహనదారులు, ప్రయాణికులకు జాగ్రత్తలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి బయటడొచ్చన్నారు. వాహనదారులు వాహన పత్రాలు తప్పక కలిగిండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


మృతుడు గొల్ల ఎర్రప్ప

రాయదుర్గం: మండలంలోని చదం గొల్లలదొడ్డికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎర్రప్ప గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి సంతాపం తెలియజేశారు. ఫోన్‌లో కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మెట్టు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ఎర్రప్ప కృషి చేశాడన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరనిలోటన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు, సర్పంచ్ రాయంపల్లి రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు ఎర్రప్ప మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఆగని ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు


దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ తోటల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో టాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేయడం తరచూ జరుగుతున్నాయి. బోరంపల్లి గ్రామం సమీపంలో గంగవరం వెళ్లే రహదారి దగ్గర ఏర్పాటు చేసిన విద్యుత్‌సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేసి, అందులోని కాఫర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు.

కిటకిటలాడిన బ్యాంకులు

కూడేరు: జల్లిపల్లి, చోళసముద్రం, కూడేరులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులు, స్టేట్ బ్యాంక్, తహసీల్దార్ కార్యాలయం గురువారం ఖాతాదారులు, రైతులు, ప్రజలతో కిటకిటలాడిపోయాయి. శని, ఆదివారాలు సాధారణ సెలవులు, సోమ, మంగళ, బుధవారం సంక్రాంతి పండగ సందర్భంగా సెలవు ప్రకటించడమే ఇందుకు కారణం.